581) సామంతం / హిందోళ

ప॥ వెన్న బట్టుకొని వెడనేలే నేతికి । కన్ను చూపులనతని గంతగమ్మనేరవా ॥

చ॥ చేరి చేయిచేత బట్టి సిగ్గున బాసడిగేవు । పోరచి నీ విభుడెందు వోయీనేయింక ।
సారెకు నీపయ్యెదలో చన్నులు దాచినట్లు । తారసిల్లి రమణుని దాచనేరవా ॥

చ॥ వొంటి జిక్కించుక నీవు వొట్టుపెట్టుకొమ్మనేవు । దంటయై వేరొకతెను తగిలీనట్టే ।
గంటువేసి పోకముడి గట్టిగా గట్టినయట్టు । వొంటిగాకుండా నాతని వొడిగట్టనేరవా ॥

చ॥ మొక్కలాన గాగిలించి మోవిముద్రలు వెట్టేవు । వెక్కసా శ్రీవేంకటగోవిందుడు నీకు ।
వొక్కమాటే కంఠహార మురమున గట్టినట్టు । చక్కని నీ మేనితోడ జంటసేయనేరవా ॥